దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

179 మంది దుర్మరణం

- ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు సిబ్బంది
- ల్యాండింగ్ సమయంలో పనిచేయని గేర్
- దూసుకెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొన్న విమానం
- మంటల్లో ప్రయాణికులు సజీవదహనం
- దక్షిణ కొరియా చరిత్రలోనే ఘోర ప్రమాదం

సియోల్: దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు సుమారు 290 కిలోమీటర్ల దూరంలోని ముువాన్ పట్టణంలో ఈ ఘోరం జరిగింది. జేజూ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737-800 విమానం బ్యాంకాక్ నుంచి తిరిగివస్తుండగా ఆదివారం ఉదయం 9.03 గంటలకు ప్రమాదానికి లోనైంది. ఈ ఘటనలో 83 మంది మహిళలు, 82 మంది పురుషులు, మరో 11 మంది గుర్తు తెలియని వ్యక్తులు మొత్తం 179 మంది వరకు మరణించారని అధికారులు వెల్లడించారు. మంటల్లో చిక్కుకున్న విమానం నుంచి ఇద్దరు ఎయిర్‌లైన్స్ సిబ్బందిని కాపాడినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. వారిద్దరూ స్పృహలోనే ఉన్నారని, వారి ప్రాణాలకు ప్రమాదమేదీ లేదని అధికారులు చెప్పారు.

ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవడం వల్లే..

దక్షిణ కొరియా టెలివిజన్ చానెళ్లు విడుదల చేసిన వీడియోలో జేజూ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రన్‌వేపైన వేగంగా దూసుకెళుతున్న దృశ్యం కనిపించింది. ఫ్రంట్ ల్యాండింగ్ గేర్ తెరుచుకోకపోవడం కూడా ఆ వీడియోలో కనిపించింది. రన్‌వేను దాటుకుని ముందుకు దూసుకెళ్లిన విమానం ప్రహరీ గోడను ఢీకొనడం, వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగడం ఆ వీడియోలో కనిపించింది. విమానం పూర్తిగా దగ్ధమైందని, కేవలం వెనుకభాగం శకలాలు మాత్రమే మిగిలాయని ముువాన్ అగ్నిమాపక కేంద్రం చీఫ్ లీ జియాంగ్ హియాన్ తెలిపారు. విమాన ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని, విమానాన్ని పక్షి ఢీకొని ఉండవచ్చా అన్న కోణాన్ని కూడా పరిశీలిస్తున్నామని ఆయన చెప్పారు. విమానం ల్యాండింగ్ కావడానికి ముందు పక్షులు ఢీకొనే అవకాశం ఉన్నట్టు ఎయిర్‌పోర్టు కంట్రోల్ టవర్ జేజూ విమాన పైలట్లకు హెచ్చరిక జారీచేసిందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. విమానాన్ని వేరే ప్రదేశంలో ల్యాండింగ్ చేయాలంటూ కంట్రోల్ టవర్ విమానం పైలట్లకు సూచనలు జారీ చేసినట్టు వారు చెప్పారు. రన్‌వేపైన విమానం అదుపుతప్పి వేగంగా ముందుకు దూసుకెళ్లడానికి కొన్ని క్షణాల ముందు విమానం పైలట్ ప్రమాదంలో చిక్కుకున్నట్టు సందేశాలు పంపించారని అధికారులు తెలిపారు. విమానం డాటాను, బ్లాక్ బాక్స్‌కు చెందిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ను ఎయిర్‌పోర్టు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని రవాణా శాఖ అధికారి జూ జాంగ్-వాన్ తెలిపారు. వీటిని ప్రభుత్వ నిపుణులు దర్యాప్తు చేసి ప్రమాదం వెనుక కారణాలను కనుగొంటారని ఆయన చెప్పారు. జనవరి 1 వరకు ముువాన్ విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్టు తెలిపారు.

జేజూ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు

విమాన ప్రమాదంపై జేజూ ఎయిర్ అధ్యక్షుడు కిమ్ ఇ-బే మృతుల కుటుంబాలకు క్షమాపణలు తెలిపారు. ప్రమాదానంతరం పరిణామాలను చక్కదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని తెలిపారు. మృతుల కుటుంబాలకు తాను క్షమాపణలు చెబుతున్నానని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత తనదేనని తన సహ ఉద్యోగులతో కలసి విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ప్రమాదానికి గురైన విమానానికి రెగ్యులర్ చెకప్‌లు జరిగినపుడు మెకానికల్ సమస్యలు ఉన్నట్టు ఎన్నడూ గుర్తించలేదని తెలిపారు. అయితే ప్రభుత్వ దర్యాప్తులో వెల్లడయ్యే ఫలితాల కోసం తాము కూడా ఎదురు చూస్తున్నామని ఆయన తెలిపారు.

ఆదివారం దక్షిణ కొరియాలోని ముువాన్ పట్టణంలో ప్రమాదానికి గురైన విమానం

మరో రెండు విమానాలకు తప్పిన ముప్పు

ల్యాండింగ్ సందర్భంగా ఎయిర్ కెనడా విమానంలో మంటలు

నార్వేలో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌లో రన్‌వే దాటేసిన విమానం

న్యూఢిల్లీ: ప్రయాణికులతో వెళుతున్న రెండు వేర్వేరు విదేశీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు శనివారం తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. దక్షిణ కొరియాలో ఆదివారం ఉదయం విమాన ప్రమాదం సంభవించి 179 మంది ప్రయాణికులు మరణించిన ఘటన జరగడానికి కొన్ని గంటల ముందు చోటుచేసుకున్న ఈ రెండు ఘటనలు విమాన ప్రయాణికుల భద్రతపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. న్యూఫౌండ్‌ల్యాండ్ దీవిలోని సెయింట్ జాన్స్ నగరం నుంచి నోవా స్కాటియా ప్రావిన్సులోని గాఫ్స్‌లో హాలిఫాక్స్ విమానాశ్రయానికి వస్తున్న ఎయిర్ కెనడాకు చెందిన విమానం శనివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ల్యాండింగ్ అవుతున్న సమయంలో అదుపు తప్పి మంటల్లో చిక్కుకుంది. ల్యాండ్ అవుతుండగా టైర్లు రన్‌వేపై సరిగ్గా దిగకపోవడంతో విమానం ఒక పక్కకు ఒరిగిపోయి ముందుకు దూసుకెళ్లినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రన్‌వేను దాటేసిన విమానం సురక్షిత ప్రదేశంలో నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. విమానం ఎడమ భాగంలో మంటలు కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించినట్టు అధికారులు తెలిపారు. నార్వేలోని ఓస్లో నుంచి నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ వెళుతున్న కెఎల్ఎం డచ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే హైడ్రాలిక్ ఫెయిల్యూర్ ఎదురొంకింది. దీంతో టార్ప్ శాండెఫ్‌జార్డ్ ఎయిర్‌పోర్టుకు విమానాన్ని మళ్లించారు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తున్న సమయంలో రన్‌వేపై అదుపుతప్పి విమానం ముందుకు దూసుకువెళ్లింది. రన్‌వేను దాటేసిన విమానం ట్యాక్సీవే సమీపంలోని గడ్డినేలను చేరుకుని అక్కడ నిలిచింది. విమానంలోని 182 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

ఆ విమానాన్ని రష్యానే కూల్చేసింది!

అజర్‌బైజాన్ అధ్యక్షుడు ప్రకటన

బాకు: కజకిస్థాన్‌లో బుధవారం కూలిపోయిన విమానాన్ని రష్యా కూల్చేసిందని, అయితే అది ఉద్దేశపూర్వక చర్య కాదని అజర్‌బైజాన్ ప్రెసిడెంట్ ఇల్హామ్ అలియెవ్ ఆదివారం చెప్పారు. దీనిని కూల్చేసినట్లు చెప్పకుండా, ఆ అంశాన్ని కప్పిపుచ్చడానికి రష్యా ప్రయత్నించిందని విమర్శించారు. రష్యా భూమిపై నుంచి ఈ విమానంపై దాడి చేశారని తెలిపారు. రష్యన్ అధికారులు కొన్ని రోజుల పాటు రకరకాల కథనాలను చెప్తుండటం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. తమకు క్షమాపణ చెప్పి, ఈ దారుణానికి బాధ్యులను కఠినంగా శిక్షించాలని రష్యాను డిమాండ్ చేసినట్లు చెప్పారు. ఈ విమానం కూలిపోవడంతో దీనిలో ఉన్న 67 మందిలో 38 మంది మరణించారు. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ క్షమాపణ చెప్పారు.

అవినీతి నిర్మూలనకు 200కుపైగా జైళ్లు

- పార్టీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలపై ప్రత్యేక డ్రైవ్
- చైనాలోని జిన్‌పింగ్ సర్కారు నిర్ణయం

బీజింగ్, డిసెంబర్ 29: అవినీతి నిర్మూలన కోసం అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తలపెట్టిన ప్రత్యేక డ్రైవ్‌కు మద్దతుగా చైనాలో ప్రత్యేక జైళ్లను నిర్మిస్తున్నారు. వీటి సంఖ్యను 2017 నుంచి 2024 మధ్య 218కి పెంచినట్టు తాజాగా 'సీఎన్ఎన్' ఓ వార్తా కథనం వెలువరించింది. నిందితులను నిర్బంధించేందుకు ప్రత్యేకంగా డిజైన్ చేస్తూ ఈ జైళ్లను నిర్మించారట. డిటెన్షన్ కేంద్రాలు లేదా లియుజి సెంటర్లుగా వీటిని పిలుస్తున్నారు. అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, నాయకులు, అధికారులు, బడా వ్యాపారులు, ప్రైవేట్ వ్యక్తులు.. ఎవరినైనా డిటెన్షన్ సెంటర్‌కు తీసుకొచ్చి పడేస్తారు. ఆరు నెలల వరకు కుటుంబ సభ్యుల్ని కలుసుకోనివ్వరు. న్యాయ సాయం పొందే అవకాశం ఉండదు. 2012లో అధ్యక్షుడు జిన్‌పింగ్.. సైన్యం, కమ్యూనిస్టు పార్టీ మీద పట్టు సాధించేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చినట్టు ఆరోపణలున్నాయి. 2020 తర్వాత పార్టీతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు కూడా విస్తరించారు. ప్రముఖ బ్యాంకర్ బావో ఫాన్, మాజీ సాకర్ స్టార్ లి టైలకు అవినీతి కేసులో 20 ఏండ్ల జైలు శిక్ష విధించారు.

గంటకు 450 కిలోమీటర్ల వేగం

హైస్పీడ్ బుల్లెట్ రైలును ఆవిష్కరించిన చైనా

బీజింగ్, డిసెంబర్ 29: ప్రపంచంలో అత్యంత వేగంగా పరుగెత్తే హైస్పీడ్ బుల్లెట్ రైలు నమూనాను చైనా ఆదివారం ఆవిష్కరించింది. గంటకు 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ హైస్పీడ్ రైలును బుల్లెట్ ట్రెయిన్‌ను మరింత ఆధునీకరించి తయారుచేసినట్టు దీని తయారీదారులు ప్రకటించారు. సీఆర్450గా ఈ కొత్త మోడల్‌ను చైనా స్టేట్ రైల్వే (గ్రూపు కంపెనీ(చైనా రైల్వే) వ్యవహరిస్తోంది. ఈ కొత్త మోడల్ బుల్లెట్ ట్రెయిన్‌తో ప్రయాణ సమయం తగ్గుతుందని ప్రస్తుతమున్న హైస్పీడ్ రైలు గంటకు 350 కి.మీ వేగంతో ఉందని, ఇది 100 కి.మీ ఎక్కువని చైనా ప్రకటించింది.

రాజ్యాంగం ఖర్గే కుటుంబానికి వర్తించదా?

కాంట్రాక్టర్ ఆత్మహత్యపై నిలదీసిన బీజేపీ

బెంగళూరు: కర్ణాటకలో కాంట్రాక్టర్ ఒకరు ఆత్మహత్య చేసుకోవడంపై అధికార కాంగ్రెస్ పార్టీపై బీజేపీ ఆదివారం తీవ్ర విమర్శలు చేసింది. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి వర్తించదా? అని ప్రశ్నించింది. బీదర్‌కు చెందిన సివిల్ కాంట్రాక్టర్ సచిన్ పంచాల్ ఆత్మహత్యకు ఖర్గే కుమారుడు, రాష్ట్ర మంత్రి అయిన ప్రియాంక ఖర్గేయే కారణమని బీజేపీ నేత ఆర్ అశోక ఆరోపించారు. అందరికీ బోధనలు చేసే ప్రియాంక్ పదవికి రాజీనామా చేసి తన నైతికత చూపాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ పంచాల్ మృతితో ప్రియాంక్ సన్నిహితులకు సంబంధం ఉందని ఆయన అన్నారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను ప్రియాంక్ ఖండిస్తూ మృతుడు రాసిన సూసైడ్ నోట్‌లో తన పేరు లేదన్నారు.

శారీరక సంబంధం అన్నంత మాత్రాన లైంగిక దాడి కాదు

ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : 'శారీరక సంబంధాలు' అనే పదాలను వాడినంత మాత్రాన లైంగిక దాడి జరిగినట్లు కాదని ఢిల్లీ హైకోర్టు తీర్పు చెప్పింది. ఫిర్యాదుదారు ఇష్టపూర్వకంగా నిందితునితో కలిసి వెళ్లినపుడు పోక్సో చట్టం కింద లైంగిక దాడి జరిగినట్లు ట్రయల్ కోర్టు ఎలా నిర్ణయించిందని ప్రశ్నించింది. నిందితునికి ట్రయల్ కోర్టు విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేసి, నిర్దోషిగా విడుదల చేసింది. లైంగిక సంభోగం జరిగినట్లు సాక్ష్యాధారాలతో నిరూపించాలని, ఊహాజనితంగా నిర్ణయించకూడదని ఈ నెల 23న ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది.

నో మిల్క్.. నో వెజిటబుల్స్

నేడు పంజాబ్‌లో రైతుల బంద్

న్యూఢిల్లీ: రైతు డిమాండ్ల పరిష్కారంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతు సంఘాలు సోమవారం పంజాబ్ బంద్‌కు పిలుపునిచ్చాయి. పాలు, పండ్లు, కూరగాయలు వంటి నిత్యావసరాలతో పాటు రోడ్డు, రైలు మార్గాలను పూర్తిగా దిగ్బంధించి పూర్తిస్థాయిలో బంద్ నిర్వహించడానికి రైతు సంఘాలు సన్నద్ధమవుతున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ బంద్‌కు పలు వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు మద్దతు తెలిపాయి. అంబులెన్స్, వివాహ వాహనాలు తప్ప మిగతావేవీ సోమవారం రోడ్లపై అనుమతించమని బంద్‌కు నేతృత్వం వహిస్తున్న రైతు సంఘాలు ప్రకటించాయి.

హనుమంతుడి కులం రాజ్‌భర్

యూపీ మంత్రి ఓపీ రాజ్‌భర్

లక్నో: రామ బంటు హనుమంతుడు రాజ్‌భర్ కులంలో జన్మించినట్లు ఉత్తరప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్ శనివారం చెప్పారు. బాలియాలోని వాసుదేవ గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ''హనుమాన్ జీ రాజ్‌భర్ కులంలో జన్మించారు. అహిరావణాసురుడు శ్రీరాముడిని, లక్ష్మణుడిని పాతాళపురికి పట్టుకెళ్లిపోయినపుడు, వారిని తిరిగి తీసుకొచ్చేందుకు ఎవరికీ ధైర్యం లేకపోయింది. కేవలం రాజ్‌భర్ కులంలో పుట్టిన హనుమంతునికి మాత్రమే ఆ ధైర్యం ఉంది. రామలక్ష్మణులను హనుమంతుడు పాతాళపురి నుంచి తిరిగి తీసుకొచ్చారు'' అని చెప్పారు.

నేడు తిరిగి తెరుచుకోనున్న

శబరిమల ఆలయం

శబరిమల: కేరళలోని శబరిమల ఆలయం ఈ ఏడాది మకరజ్యోతి పండుగ సందర్భంగా సోమవారం నుంచి తెరుచుకుంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రధాన పూజారి తంత్రి కందర్ రాజీవరు నేతృత్వంలో సాయంత్రం 4 గంటలకు మేళశాంతి ఎస్ అరుణ్‌కుమార్ ఆలయాన్ని తెరుస్తారని చెప్పారు. ఈ పండుగలో భాగంగా ప్రతి ఏడాది జనవరి 14న సంక్రాంతి నాడు భక్తులు మకర జ్యోతిని దర్శించుకుంటారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న ఆలయాన్ని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో వేలాది భక్తులు పాల్గొన్నారు.

హెచ్1బీకి నేనెప్పుడూ అనుకూలమే

- ప్రకటించిన ట్రంప్
- మస్క్ వైఖరికి మద్దతు తెలిపిన కొత్త అధ్యక్షుడు

వాషింగ్టన్, డిసెంబర్ 29: నిపుణులైన విదేశీ ఉద్యోగులు, కార్మికులు అమెరికా రావడానికి ఉపయోగించే హెచ్1బీ వీసా విధానానికి తానెప్పుడూ అనుకూలమేనని కొత్తగా ఎన్నికైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హెచ్-1బీ వీసాలపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అయన మద్దతు తెలిపారు. 'నేనెప్పుడూ హెచ్1బీ వీసాలను ఇష్టపడతాను. నేను దానికి అనుకూలమే' అని ఆయన న్యూయార్క్ పోస్ట్‌కు తెలిపారు. వలసల విధానంపై ట్రంప్ పార్టీలో రెండు రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిభ ఆధారిత వలసల విధానానికి మస్క్‌తో పాటు భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి మద్దతు ఇచ్చారు. అయితే ఈ విధానం అమెరికన్ల ప్రతిభను తక్కువ చేసి చూపడమేనని పార్టీలోని కొందరు వాదిస్తున్నారు. 'స్పేస్ ఎక్స్ టెస్లా సహా ఇతర వందలాది కంపెనీలను నిర్మించిన విశిష్టమైన వ్యక్తులతో నేను అమెరికాలో ఉన్నానంటే దానికి కారణం హెచ్1బీ వీసా' అని మస్క్ ఎక్స్‌లో రాశారు. పార్టీలోని కొందరు సన్నిహితులు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న క్రమంలో మస్క్‌కు ట్రంప్ తన మద్దతు తెలియజేశారు. హెచ్1బీ వీసాలపై ట్రంప్ అనుకూల వైఖరి భారతీయులకు బాగా కలిసొస్తుందని భావిస్తున్నారు.

జర్మనీ ఎన్నికల ముందు కాక రేపిన మస్క్

ఫార్ రైట్ వింగ్ పార్టీకి మద్దతుగా వ్యాసం

బెర్లిన్: అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక మద్దతుదారు ఎలాన్ మస్క్ దృష్టి జర్మనీపై పడింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న జర్మన్ పార్లమెంటు ఎన్నికలు జరుగుతుండటంతో, ఈసారి అధికార మార్పిడి జరగాలని మస్క్ ఓ వ్యాసంలో చెప్పారు. 'ఈ దేశానికి చిట్టచివరి ఆశాకిరణం 'ది ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ' పార్టీ అని తెలిపారు. ఈ ఫార్ రైట్ వింగ్ పార్టీ దేశాన్ని తీర్చిదిద్దగలదన్నారు. ఆర్థిక సౌభాగ్యం, సాంస్కృతిక సమగ్రత, టెక్నలాజికల్ ఇన్నోవేషన్ అనేవి కేవలం కోరికలుగా మాత్రమే కాకుండా వాస్తవ రూపందాల్చే విధంగా దేశాన్ని నడపగలదని చెప్పారు.

ప్రైవేట్ బ్యాంకుల్లో తగ్గుతున్న ఉద్యోగులు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకులలో ఉద్యోగుల సంఖ్య తగ్గుదల 25 శాతానికి పెరిగిందని, ఈ సంఖ్య పెరగడం వల్ల బ్యాంకుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆర్‌బీఐ తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. 2023-24 సంవత్సరంలో కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకులు, చిన్న ఆర్థిక బ్యాంకుల లో(ఎస్ఈబీ) ఉద్యోగుల క్షీణతా శాతం దాదాపు 25 వరకు ఉందని దేశంలో 2023-24లో బ్యాంకింగ్ వ్యవస్థ పరిణామాలు, ప్రగతిపై రూపొందించిన తాజా నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది.

ఢిల్లీలో ఆపరేషన్ లోటస్

ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఓటర్ల లిస్టులోని కొందరు ఓటర్లను తొలగించి వచ్చే ఎన్నికల్లో అక్రమంగా అధికారంలోకి రావడానికి బీజేపీ ఆపరేషన్ లోటస్‌కు తెరతీసిందని ఆప్ ఆరోపించింది. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ షహందర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ 11 వేల ఓట్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఈ స్థానంలో 5 వేల మెజారిటీతో నెగ్గామని ఆయన చెప్పారు.

నేడు 'స్పాడెక్స్' ప్రయోగం

- పీఎస్ఎల్‌వీ సీ-60 రాకెట్ ద్వారా నింగిలోకి రెండు ఉపగ్రహాలు
- దిగువ భూకక్ష్యలో అనుసంధానం
- ప్రత్యక్ష ప్రసారం చేయనున్న ఇస్రో

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఖగోళ పరిశోధనల్లో అద్భుత విజయాలతో సత్తా చాటుతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. ఎంతో కాలం నుంచి ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'స్పాడెక్స్' ప్రయోగాన్ని మరికొన్ని గంటల్లో చేపట్టనున్నది. దీనిలో భాగంగా సోమవారం రాత్రి 9:58 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) మొదటి లాంచ్‌పాడ్ నుంచి పీఎస్ఎల్‌వీ (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) సీ-60 రాకెట్ ద్వారా ఎస్‌డీఎక్స్-01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) ఉపగ్రహాలను నింగిలోకి పంపనున్నది. వాటిని దిగువ భూకక్ష్యలో అనుసంధానించేందుకు ప్రయత్నించనున్నది. భవిష్యత్తులో భారత్ చేపట్టే ఉపగ్రహ ప్రయోగాలు, చంద్రునిపై జరిపే పరిశోధనలతోపాటు రోదసిలో భారత అంతరిక్ష కేంద్రం అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రయోగం ఖగోళ పరిశోధనల్లో ఇస్రో సాధించిన గణనీయ పురోగతికి సూచికగా నిలువనున్నది. విజయంతో 2024 సంవత్సరానికి వీడ్కోలు పలకాలని భావిస్తున్న ఇస్రో ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది.

అమెరికాలోని టెక్సాస్, మిసిసిప్పీల్లో టోర్నడోలు బీభత్సం సృష్టించాయి. ఇద్దరు మృతి చెందగా, అరుగురు గాయపడ్డారు. ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. మిసిసిప్పీలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సుమారు 71 వేల మంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అలబామాలో హై అలర్ట్ ప్రకటించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

పీవీ విషయంలో కాంగ్రెస్ చర్యను మర్చిపోలేం

ప్రణబ్‌కుమార్తె శర్మిష్ఠ

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో చీడ ప్రారంభమైందని, పార్టీ దుస్థితిపై తీవ్రంగా ఆత్మావలోకనం చేసుకోవడం తప్పనిసరి అని శర్మిష్ఠ ముఖర్జీ అన్నారు. చాలా మంది పాత కాంగ్రెస్ నేతలు పార్టీతో తాము వేరుగా ఉన్నామనే భావనతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, అగ్ర నేతలకు ఓ సిద్ధాంతం లేకపోవడం దీనికి కారణాలని వివరించారు. శర్మిష్ఠ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె. ఆమె ఆదివారం ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వంశపారంపర్య నేతలు కానివారి సేవలను కాంగ్రెస్ గుర్తించడం గురించి అడిగినపుడు శర్మిష్ఠ బదులిస్తూ, మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విషయంలో ఏం జరిగిందో మనం మర్చిపోలేమన్నారు.

కవలలు.. ఘరానా దొంగలు

భోపాల్: ఇద్దరు కవల సోదరులు చాకచక్యంగా పోలీసుల కళ్లుగప్పి దొంగతనాలు చేశారు. ఒకరు దొంగతనం చేస్తూ ఉంటే, మరొకరు అదే సమయంలో వేరొక చోట ఉన్నట్టు పోలీసులను నమ్మించేలా సీసీటీవీలో రికార్డయ్యేలా ప్రవర్తించేవారు. కేసు దర్యాప్తు సమయంలో తాను దొంగతనం చేయలేదని, పలానా చోట ఉన్నానని సీసీటీవీ ఫుటేజ్‌ను చూపించేవారు. మధ్యప్రదేశ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సౌరభ్ వర్మ, సంజీవ్ వర్మ ఒకేలా ఉండే కవలలు. వీరిద్దరూ ఓ ఇంట్లోకి వెళ్లి, లక్షలాది రూపాయల విలువ చేసే ఆభరణాలు, ఇతర వస్తువులను దోచుకున్నారు. పోలీసులు సౌరభ్‌తోపాటు మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. అంతలోనే సంజీవ్ తనంతట తానే పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. అన్నదమ్ములిద్దరినీ చూసిన పోలీసులు అయోమయానికి గురయ్యారు. సంజీవ్‌ను కూడా అరెస్ట్ చేసి, ప్రశ్నించారు. అన్నదమ్ములిద్దరూ తమ గుట్టును తామే బయటపెట్టారు.

నిన్న డ్రోన్స్.. నేడు రెడ్ ఆర్బిట్స్

వాషింగ్టన్, డిసెంబర్ 29: అమెరికాలో మళ్లీ వింత వస్తువులు ఆకాశంలో సంచరించటం తీవ్ర కలకలం రేపింది. ఆ దేశ గగనతలంలో అంతుచిక్కని డ్రోన్ల సంచారం ఇటీవల మిస్టరీగా మారింది. ఇవి కనిపించిన ప్రాంతంలోనే తాజాగా ఆకాశంలో గోళాకారంలోని ఎర్రటి వస్తువులు సంచరించటం కొంతమంది కంటపడ్డాయి. తమకు ఆకాశంలో 'రెడ్ ఆర్బిట్స్' కనిపించాయని తూర్పు అమెరికాలో పలువురు చెప్పటం సంచలనంగా మారింది. న్యూజెర్సీ మీదుగా వెళ్తున్న 'రెడ్ ఆర్బిట్స్' అంటూ ఒకరు 'ఎక్స్'లో వీడియోను షేర్ చేశారు. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్న ప్రయాణికుడు 'రెడ్ ఆర్బిట్స్'ను వీడియో తీశాడంటూ 'ద మిర్రర్' కథనం పేర్కొన్నది. 'లాస్ వెగాస్ నుంచి న్యూయార్క్ వెళ్తుండగా ఆ రోజు (డిసెంబర్ 27న) రాత్రి 9.30 గంటలకు న్యూజెర్సీ మీదుగా రెండు 'రెడ్ ఆర్బిట్స్'ను చూశాను' అని డీజే నార్కట్టా అనే యూజర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. 'ఆకాశంలో నిశ్శబ్దంగా సంచరిస్తున్న 'రెడ్ ఆర్బిట్స్'. ఇవి నిజమైన 'యుఎఫ్‌వో'లు కాదంటూ ప్రభుత్వం మనకు చెబుతున్నది' అంటూ పలువురు సోషల్‌మీడియాలో సందేశాలు పోస్ట్ చేశారు.

అణు బంకర్లకు భలే గిరాకీ

- అమెరికా వాసులకు యుద్ధ భయం..
- రోజురోజుకూ పెరుగుతున్న విక్రయాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: అమెరికా ప్రజలను మూడో ప్రపంచ యుద్ధం భయపెడుతున్నది. దీంతో అణు యుద్ధం వచ్చినా సురక్షితంగా ప్రాణాలను రక్షించే బంకర్లకు డిమాండ్ పెరిగిపోతున్నది. ఇప్పటికే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అవసరమైతే అణ్వాయుధాలు ప్రయోగిస్తామని రష్యా చేస్తున్న ప్రకటన, మరో వైపు ఉత్తర కొరియా, చైనా దేశాలు అణ్వాయుధ సంపత్తిని పెంచుకుపోవడం, పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు.. ఈ అన్ని కారణాలూ అమెరికా వాసులను బంకర్ల కొనుగోలుకు ప్రేరేపిస్తున్నాయి. దీంతో చాలా అమెరికా కుటుంబాలు అణు బంకర్లను కొనుగోలు చేస్తున్నాయి. వీటిని సుమారు 50,000 డాలర్ల వరకు పెట్టి కొంటున్నారని వాటిని తయారు చేసే సంస్థ డెయిలీ మెయిల్‌కు వెల్లడించింది. మునుపెన్నడూ లేనివిధంగా గత ఏడాది వీటి అమ్మకాలు తారస్థాయికి చేరుకున్నట్టు తెలిపింది.

బంకర్లలో అన్ని వసతులు

అమెరికాలోని ఓహియో కేంద్రంగా ఉన